www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 29 డిసెంబర్ 2023

5

ఏలూరు

జగనన్నా.. మా గోడు వినన్నా..!

సిఎంకు పోస్టుకార్డుల ద్వారా అంగన్వాడీల వినతి - 17వ రోజుకు సమ్మె

ఏలూరు కలెక్టరేట్ వద్ద పోస్టుకార్డులతో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

6లో..

సిఎం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు పలు హామీలు గుప్పించడం.. తర్వాత అవి కార్యాచరణకు నోచుకోకపోవడం పరిపాటిగామారింది. అధికారంలోకొచ్చాక సిఎం జగన్ ఇచ్చిన ప్రధానమైన హామీల్లో ఏ ఒక్కటీ నాలుగున్నరేళ్లు గడిచినప్పటికీ అమలుకాని పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రిస్థాయిలో ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంపై జిల్లా ప్రజానీకంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. శుక్రవారం భీమవరానికి సిఎం విచ్చేస్తుండటంతో సిఎం సారూ.. హామీలు మరిచారంటూ జనం చర్చించుకుంటున్నారు.

- అగమ్యగోచరం వాటర్‌గ్రిడ్ నిర్మాణం
- అదేబాటలో నరసాపురంలో ఫిషింగ్ హార్బర్, వశిష్టవారధి
- అటకెక్కిన కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణం
- భీమవరంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు గాలికే
- దిక్కుతోచని స్థితిలో పోలవరం నిర్వాసితుల పరిస్థితి
- నేడు భీమవరంలో సిఎం జగన్ పర్యటన

సిఎం సారూ.. హామీలు మరిచారు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2019 ఎన్నికల ముందు భీమవరం ప్రాంతంలో సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా కలుషిత తాగునీటి సమస్యపై జగన్ అప్పటి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈనీళ్లు ఎవరైనా తాగుతారా అంటూ బాటిల్‌లో పట్టిన నీరు చూపించేవారు. తాము అధికారంలోకి వస్తే గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీటిని అందిస్తామంటూ హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత రూ.3,200 కోట్లతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేయనున్నట్లు హడావుడి చేశారు. తర్వాతకొంత కాలానికి విభజిత పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రమే రూ.1400 కోట్లతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. జగన్ సిఎంగా బాధ్యతలు చేపట్టి నాలుగున్నరేళ్ల గడిచిపోయింది. మరో మూడునెలల్లో మళ్లీ ఎన్నికలు రానున్నాయి. ఇప్పటివరకూ వాటర్‌గ్రిడ్ పథకం అమలుకు నోచుకోలేదు. కలుషిత తాగునీటినే తాగుతూ జనం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ సొమ్ములు ఖర్చుపెట్టి తాగునీరు కొనుగోలు చేసుకుని బతుకులు నెట్టుకొస్తున్నారు. ఐదేళ్లకాలంలో కూడా తాగునీటి హామీ నెరవేర్చకపోవడంపై ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సిఎం శుక్రవారం భీమవరం వస్తుండటంతో సిఎం ఇచ్చిన హామీలను అంతా గుర్తుచేసుకుంటున్నారు. 2022 నవంబర్ 21న మత్స్యకారులు దినోత్సవం సందర్భంగా నరసాపురంలో సిఎం పర్యటించారు. రూ.3,300 కోట్లకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అందులో ఎన్నిపూర్తిచేశారో నాయకులే చెప్పాల్సి ఉంది. బియ్యపుతిప్పవద్ద ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేసి మత్స్యకారుల జీవితాలను మార్చేస్తామన్నారు. ఇప్పటి వరకూ దానిఊసేలేకుండాపోయింది. ఆక్వా యూనివర్సిటీకి సంబంధించి ఇప్పటికీ భవనాలు పూర్తికాలేదు. నరసాపురంవాసుల కలగా మిగిలిపోయిన గోదావరిపై వశిష్ట వారధి నిర్మిస్తామంటూ హామీ ఇచ్చారు. 2023 జనవరిలోనే టెండర్లు పూర్తిచేస్తామన్నారు. ఇప్పటికీ అతీగతీలేదు.

అటకెక్కిన కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణం

సముద్రంలోని ఉప్పునీరు కొల్లేరులోకి ఎగదన్ని కొల్లేరు కలుషితమవుతుండంతో, మూడు రెగ్యులేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు 2022లో 16న గణపవరంలో జరిగిన సభలో సిఎం చెప్పారు. ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం మోళ్లపర్రు, కృష్ణాజిల్లా పడతడిక వద్ద రెగ్యులేటర్ల నిర్మాణానికి రూ.470 కోట్ల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకూ ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. కొల్లేరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇప్పటికీ పట్టించుకున్న దాఖలాల్లేవు.

భీమవరంలో డంపింగ్ యార్డ్ హామీ గాలికే

భీమవరం పట్టణంలోని చెత్తవేసేందుకు డంపింగ్ యార్డ్ లేకపోవడం గత ఎన్నికల నుంచి పెద్ద సమస్య మారింది. నిత్యం దాదాపు 80 మెట్రిక్ టన్నుల చెత్త ఉంటుందని లెక్కలు చెబుతున్నాయి. అప్పట్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దీనిపై మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామని జగన్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ డంపింగ్‌యార్డ్ ఏర్పాటు ఏమైందో ఏ ఒక్కరికీ తెలియడం లేదు.

దిక్కుతోచని స్థితిలో పోలవరం నిర్వాసితులు

రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్ట్ కోసం సర్వం త్యాగంచేసిన అక్కడ నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ఎన్నికల సమయంలో నిర్వాసితులకు జగన్ అనేక హామీలు గుప్పించారు. పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షలనుంచి రూ.పదిలక్షలకు పెంపుచేస్తామన్నారు. 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదులక్షల పరిహారం ఇస్తామన్నారు. కాలనీలు త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. యువతకు పరిహారం అందిస్తామన్నారు. నాలుగున్నరేళ్ల గడిచినా ఇప్పటికీ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా పోలవరం కాఫర్‌డ్యాం పూర్తిచేశారు. దీంతో ప్రతిఏటా జులై, ఆగస్టునెలల్లో విరుచుకుపడే వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలు ముంపుకు గురవుతున్నాయి. దీంతో నిర్వాసిత గిరిజనులు కట్టుబట్టలతో పునరావాస శిబిరాలకు, కొండలు, గుట్టలపైకి వెళ్లి నెల తరబడి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి దాపురించింది. మరో మూడునెలల్లో వైసిపి ప్రభుత్వ పదవీకాలం పూర్తవుతోంది. నిర్వాసితులకిచ్చిన హామీలు అమలు చేస్తారో లేదో తెలియడం లేదు.

నేడు సిఎం పర్యటన సాగేదిలా..

శుక్రవారం ఉదయం పదిగంటలకు సిఎం జగన్ ఇంటినుంచి కారులో హెలిప్యాడ్‌కు బయలుదేరుతారు. 10.40కు భీమవరంలోని లూథరన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగుతారు. 10.45 నుంచి 10.55 వరకూ జనంతో మాట్లాడుతారు. 11.15కు సభాప్రాంగణానికి చేరుకుంటారు. 11.15 నుంచి 12.30 గంటల మధ్య విద్యాదీవెన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తర్వాత స్థానిక నాయకులను కలిసి 1.45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తాడేపల్లి వెళతారు.

మూడో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

మున్సిపల్ కార్మికుల సమ్మె గురువారానికి మూడోరోజుకు చేరింది. ఈ సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి ప్రసంగించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, బటన్ నొక్కే అవకాశం ప్రజలకూ వస్తుందని, అప్పుడు ఎవరు అధికారంలో ఉండాలో ప్రజలు తేల్చుకుంటారన్నారు. ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు మాట్లాడుతూ అనేక దఫాలుగా ప్రభుత్వానికి విన్నవించినా మున్సిపల్ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించలేదని, 20 రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని కోరినా ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. పాదయాత్రలో సిఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులకు పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలని కోరారు. క్లాప్ వాహనాల డ్రైవర్లకు జిఒ ఏడు ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని, దళారీ వ్యవస్థను రద్దుచేసి మునిసిపాలిటీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. క్లాప్ వాహనాల డ్రైవర్లకు కాంట్రాక్టర్లు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వారాంతపు సెలవులు, పండగ సెలవులు అమలు చేయడం లేదని, గుర్తింపు కార్డులు, యూనిఫారమ్, మాస్కులు, గ్లౌజులు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. ఏలూరు మున్సిపాలిటీలోనే 800 మంది కార్మికులు సమ్మెలో ఉన్నారని, ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వాహన డిపో వద్ద ఆందోళన

మూడో రోజు మునిసిపల్ క్లాప్ వాహనాల డిపో నుండి వాహనాలను బయటకు తీసేందుకు ప్రయత్నించిన ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చర్యలను కార్మికులు సంఘటితంగా ప్రతిఘటించారు. క్లాప్ వాహనాల డిపో వద్దకు పోలీసులతో వచ్చిన కమిషనర్ తాత్కాలిక డ్రైవర్ల ద్వారా వాహనాలను బయటకుతీసేందుకు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో కమిషనర్‌కు కార్మికులకు మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో డిపో గేటు వద్ద కార్మికులు బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. తమ కుటుంబాలతో పాటు గేటు వద్ద బైఠాయిస్తామని, అవసరమైతే తమ మీద నుంచి వాహనాలను తీసుకువెళ్లాలని కార్మికులు చెప్పడంతో కమిషనర్ వెనక్కి తగ్గారు. పోలీసులతో సహా అక్కడ నుండి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమానికి సిఐటియు ఏలూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాథం, వి.సాయిబాబు, ఆటో ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, క్లాప్ వాహనాల యూనియన్ నాయకులు పుష్పరాజు నాయకత్వం వహించారు.

చింతలపూడి : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ నారాయణ అన్నారు. పట్టణంలోని నగరపంచాయతీ వద్ద మున్సిపల్ వర్కర్స్ సమ్మె మూడో రోజుకు చేరింది. సమ్మెకు సిఐటియు పూర్తి మద్దతు ఉందన్నారు. ఎపి ఎన్‌జిఒ నాయకులు ఎ.హుస్సేన్ తమ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి నగరపంచాయతీలో మున్సిపల్ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని, తక్షణం సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆప్కాస్‌లో చేర్చాలని, హెల్త్ వెలివెన్సులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పృథ్వి, నాగరాజు, పద్మ, కమలకుమారి పాల్గొన్నారు.

9 నుంచి సిపిఎం రాష్ట్ర సమావేశాలు

ఏలూరులో నిర్వహణ

ఏలూరు అర్బన్:వచ్చేనెల 9, 10, 11 తేదీల్లో ఏలూరులో తొలిసారిగా సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగబోతున్నాయని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. తొమ్మిదో తేదీన జరిగే జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలోని ఉద్దరాజు రామం భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈ సమావేశాలకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశాల్లో బిజెపిని, దానిమిత్ర పక్షాలను ఓడించడం, వామపక్ష శక్తుల ఐక్యత, సిపిఎం స్వతంత్ర విధానం, రానున్న ఎన్నికల్లో సిపిఎం అనుసరించాల్సిన ఎత్తుగడలు తదితర అంశాలపై లోతైన చర్చలు జరుగుతాయన్నారు. ప్రజల సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, వైసిపి అప్రజాస్వామిక, నిరంకుశ చర్యల్ని ఎండగట్టడం వంటి అంశాలపై పలు తీర్మానాలు చేస్తారని, అంగన్వాడీల, ఆశా, మున్సిపల్, సర్వశిక్షా అభియాన్, వాలంటీర్ల, ఉపాధ్యాయులు, న్యాయవాదుల పోరాటాలకు సంఘీభావం- కార్యాచరణపై నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. భూ పోరాటాలు, తుపాను, కరవు ప్రాంతాల సహాయం, ఉద్యమాల రూపకల్పన వంటి అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. తొమ్మిదో తేదీన జిల్లా సమగ్రాభివృద్ధిపై సదస్సు ఉంటుందని, ఈ సదస్సులో జిల్లాలో ఉన్న వనరులు, అవకాశాలు, వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాల్లో అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక విడుదల చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సుకు ఎంఎల్‌సిలు కె.లక్ష్మణరావు, ఐవి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర నాయకులు, జిల్లా ప్రముఖులు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయలు, సలహాలు అందచేస్తారన్నారు. ఈ సదస్సులో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని, 10,11 తేదీల్లో జరిగే సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల నిర్వహణకు సహకరించాలని రవి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవితోపాటు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్, ఏలూరు నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల వంటావార్పు

తొమ్మిదో రోజుకు సమ్మె

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

వంటావార్పు చేస్తున్న ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె తొమ్మిదో రోజు గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సమ్మె శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు నారాయణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో కీలకపాత్ర వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు భగవాన్, పాల్‌రాజు, క్రాంతి, దిలీప్, బాలాజీ, రాజు, సత్య, చినబాబు, వై.శ్రీనివాసరావు, వీరమణి, శ్యామల, ఝూన్సీ, వెంకట లక్ష్మీ, కుమారి, కె.లక్ష్మీకాంతం, భవానీ పాల్గొన్నారు.

విజయం సాధించిన యూనియన్ నాయకులు

'కుశలవ' గుర్తింపు సంఘం ఎన్నికల్లో

సిఐటియు ఘనవిజయం

ఆగిరిపల్లి:మండలంలోని నెక్కలం గొల్లగూడెం కుశలవ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పరిశ్రమలో జరిగిన కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు అనుబంధ కుశలవ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వర్కర్స్ యూనియన్ 139 ఓట్లతో విజయం సాధించింది. గురువారం గుర్తింపు సంఘాల ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో టిఎన్‌టియుసి అనుబంధ యూనియన్‌కు 74 ఓట్లు మాత్రమే వచ్చాయి. కుశలవ ఆల్ ఎంప్లాయీస్ యూనియన్‌కు 94 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా సిఐటియు అనుబంధ యూనియన్ అధ్యక్షులు డి.వి.కృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం కార్మికుల శ్రేయస్సు కోసం, హక్కుల రక్షణ కోసం పనిచేస్తున్న సిఐటియు పట్ల నమ్మకంతో గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న కాలంలో పరిశ్రమలో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం కోసం, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. యాజమాన్యం ఎన్ని కుట్రలు పన్నినా కార్మికులు నిజాయితీగా పనిచేస్తున్న సిఐటియుని గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.రాజు, యూనియన్ కార్యదర్శి కెవికెఎస్.ప్రసాద్, ఆర్.చంటి, శ్రీరామ్మూర్తి, రామకృష్ణ, నరేష్, శ్రీనివాస్, కోటేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్ఎలు

విఆర్ఎల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం(సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి విఆర్ఎలు తరలివచ్చారు. కనీస వేతనం, డిఎ, పేస్కేల్ అమలు చేయాలని, నామినీ విఆర్ఎలను రెగ్యులర్ చేయాలని, తదితర డిమాండ్లతో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాజీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం తమను నమ్మించి గొంతు కోసిందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉండగా విఆర్ఎలకు కనీస వేతనం రూ.15 వేలు ఇస్తానని హామీ ఇచ్చారని, నేటికీ దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఎన్ని ఉద్యమాలు చేసినా తమ గొంతు నొక్కారని, ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే వచ్చేనెల ఐదో తేదీన చలో సిసిఎల్ఎ కార్యాలయం నిర్వహిస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో ప్రతిపనికీ విఆర్ఎలను ఉపయోగించుకుంటూ జీతం దగ్గరకు వచ్చేసరికి రూ.పది వేలతో సరిపెట్టడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో సాధించిన డిఎని కూడా ఈ ప్రభుత్వం రికవరీ చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణం రికవరీ చేసిన డిఎని విఆర్ఎల ఖాతాల్లో వేయాలని, జీతాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం జిల్లా కోశాధికారి గంగాధర్‌రావు, ఆర్.వెంకటేశ్వరరావు, పకీర్ మీరావలి నాయకత్వం వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి జీతాల పెంపు విషయమై నివేదిక పంపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామపంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జిల్లా నలుమూలల నుండి పంచాయతీ కార్మికులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన పంచాయతీ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని వీరికి ఎంత వేతనాలిచ్చినా తక్కువేనని మాట్లాడిన సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతానని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనబకాయిలు తక్షణం చెల్లించాలని, టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలివ్వాలని, కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ పరిపాలనలో పంచాయతీల్లో రేయింబవళ్లు సేవలందిస్తున్న పంచాయతీ కార్మికులకు సక్రమంగా ప్రతినెలా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం తాగునీరు వీధిలైట్లు నిర్వహణ వంటి కీలక పనులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు ఆరు నెలల నుండి 20 నెలల వరకూ వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. వేతనాల్లేక కార్మికుల కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకుని వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. టెండర్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చిన సిఎం జగన్ నాలుగున్నరేళ్లు గడిచినా దాని ఊసెత్తకపోవడం అన్యాయమన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బంగారు కృష్ణ మాట్లాడుతూ కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలో నిధుల్లేక రక్షణ పరికరాలు కార్మికులకు అందజేయడం లేదని దానివల్ల కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ ధర్నాకు యూనియన్ కార్యదర్శి నాగరాజు, వి.నాని, గంగరాజు నాయకత్వం వహించారు.

బాలోత్సవాలతో చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తి

బహుమతుల ప్రదానోత్సవంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బహుమతి అందుకుంటున్న కలెక్టర్ కుమార్తె



ఎస్‌పి కుమార్తె



విజేతకు బహుమతి అందిస్తున్న అధికారులు

హేలాపురి బాలోత్సవాల నిర్వహణ ద్వారా చిన్నారుల్లో ప్రతిభను వెలికితీయొచ్చని, వారిలో క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో హేలాపురి బాలోత్సవం-4వ పిల్లల సంబరాల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతి ప్రదానోత్సవం హేలాపురి బాలోత్సవ నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోపాటు చిన్నారులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా భాగస్వాములను చేయడానికి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయొచ్చని కలెక్టర్ తెలిపారు. హేలాపురి బాలోత్సవాలు కీర్తిశేషులు షేక్ సాబ్జీ ఆధ్వర్యంలో నిర్వహించుకునేవారమని, కానీ ప్రమాదానికి గురై ఆయన మరణించడం బాధాకరమన్నారు. జిల్లాస్థాయిలో ఏడు మండలాలకు సంబంధించిన 137 స్కూల్స్ నుండి 7,500 మంది 69 అంశాల్లో పాల్గొనడం చాలా సంతోషదాయకమన్నారు. పెద్దల సమక్షంలో జరిగే కార్యక్రమాల నిర్వహణ కంటే చిన్నారుల కార్యక్రమాలు నిర్వహించడం కష్టసాధ్యమని, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, వివిధ సంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు చాలా శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల ప్రేమానురాగాలను పెంచుకోవాలని కనీసం వారితో గడపడానికి సమయం కేటాయించాలన్నారు. తల్లిదండ్రులు ఇలాంటి కార్యక్రమాల్లో వారి పిల్లలను గెలుపుకోసం కాకుండా భాగస్వామ్యం చేయడం ద్వారా వారిలో స్ఫూర్తిని కలిగించినవారవుతారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం ద్వారా వారు మానసికంగా ఫోన్లకే పరిమితమవుతున్నారని, పదోతరగతి వరకూ ఫోన్లు ఇవ్వకుండా చూడాలని తెలిపారు. పిల్లల్లో ఎక్కువగా పౌష్టికాహార లోపం కనిపిస్తుందని దీనికి ప్రధాన కారణాలు తినుబండారాలు, నూడిల్స్, బర్గర్లు, ఐస్ క్రీమ్స్ వంటివి అలవాటు చేయడమేనని వీటిని తగ్గించి మంచి పౌష్టికాహారం అందించేలాగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాప్రమాణాల మెరుగుకు నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేశారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువున్న విద్యార్థులకు ట్యాబ్స్, వీడియో టీవీల ద్వారా విద్యాబోధనలు ఇంగ్లీషు మీడియం ద్వారా విద్యను అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరినీ అభినందించారు. ఎస్‌పి మేరీప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లోనూ భాగస్వామ్యం చేయాలన్నారు. తల్లిదండ్రులు బాలోత్సవాల కార్యక్రమానికి వారి పిల్లలను వివిధ కళారూపాల్లో శిక్షణనిచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం మంచి పరిణామమన్నారు. అనంతరం విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. బాలోత్సవంలో కలెక్టర్ ఇద్దరు కుమార్తెలు, అశ్రిత, సహస్ర అన్విత, జిల్లా ఎస్‌పి కుమార్తె హదస్సా పాల్గొని ఆయా పోటీల్లో తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వారికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవ ఆర్గనైజింగ్ సెక్రటరీ జివి.నరసింహారావు, కమిటీ నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, నిర్మల, డిఇఒ శ్యామ్‌సుందర్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఎం.ఇమ్మానుయేలు, సిఇఒ సెంట్రల్ ఎం.మహారాజు, అమరావతి బాలోత్సవం అధ్యక్షులు పి.మురళీకృష్ణ, ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ రావి గోపాలకృష్ణయ్య, వెంకట సుబ్రహ్మణ్యం, సురేష్‌చంద్ర బహుగుణ స్కూల్ ప్రిన్సిపల్ స్రవంతి, సిఆర్‌ఆర్ కాలేజీ ప్రిన్సిపల్ కెఎ.రామరాజు, గోద్రేజ్ ఆగ్రో అడ్వైజర్ కుమార్, బాలోత్సవం నిర్వహణ కమిటీ సభ్యులు అకాడమిక్ విభాగం ఎస్‌కె.ముస్తఫా అలీ, ఎస్ కస్తూరి రావ్, వై.ఆనంద నాయుడు, ఎం.కాంతారావు, కల్చరల్ నిర్వాహకులు పి.మంగరాజు, డి.హేమ సుందర్, వై.అర్జున్‌రావు, ఎం.వెంకటరత్నం, కె.సత్యనారాయణ, ఎం.కోటేశ్వరరావు, మేతర అజయ్‌బాబు, వి.సురేష్, ఆంజనేయులు, జి.శారద, లక్ష్మీ పాల్గొన్నారు.

డిఐజి అశోక్ కుమార్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

డిఐజి జివిజి అశోక్ కుమార్‌కు ఐజిగా ఉద్యోగన్నతి ఇస్తూ పోలీసు రాష్ట్ర కార్యాలయం నుంచి బుధవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. బుధవారం రాత్రి 9 మంది డిఐజిలకు ఐజిలుగా ఉద్యోగోన్నతినిస్తూ పోలీసు రాష్ట్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఏలూరు రేంజ్ డిఐజిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న జివిజి అశోక్ కుమార్ ఐజిగా ఉద్యోగోన్నతి పొందారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023, జిఓ నెంబర్ 512ను రద్దు చేయాలని కోరుతూ గురువారం జిల్లా కోర్టు నుంచి న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు సంయుక్తంగా బైక్ ర్యాలీగా వెళ్లి పాత బస్టాండ్ వద్ద డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందిచారు. ఏలూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎన్ఎంఎం.నాగరాజు అంబేద్కర్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫైర్ స్టేషన్ సెంటర్‌కు చేరుకొని న్యాయవాదులు, న్యాయవాది గుమస్తాలు మానవహారం నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీకి వివిధ సంఘాలకు చెందిన ప్రజాసంఘాల నాయకులు న్యాయవాదులకు మద్దతు తెలుపుతూ వారి సంఘీభావాన్ని తెలియజేశారు. టిడిపి నాయకులు బడేటి చంటి, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, సిపిఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు వారి మద్దతును న్యాయవాదులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పీడీ.ప్రసాద్, ట్రెజరర్ గొర్రెల సతీష్ కుమార్, తిగిరిపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయాలి : గన్ని

ప్రజాశక్తి - భీమడోలు

టిడిపికి పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు పార్టీ ఆదేసిత కార్యక్రమాలను నిబద్ధతతో పూర్తిచేయాలని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. పార్టీ ఆదేశాల మేరకు భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నూరు శాతం లక్ష్యాలను పూర్తిచేసిన అంబర్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్ నెంబర్లు 80, 83ల బాధ్యులు ప్రగఢ గోవింద్, వి.చంద్రశేఖర్‌లను గురువారం పార్టీ కార్యాలయంలో గన్ని వీరాంజనేయులు గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు దూసనపూడి పుల్లయ్య నాయుడు, రామిశెట్టి బుజ్జి గోపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ఇటికలకోట గ్రామ పంచాయతీ ఆవరణలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను ఎంపిడిఒ జి.శ్రీను సర్పంచి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ వైద్యం కోసం పేదలు ఏ ఒక్కరూ అప్పుల పాలు కాకూడదనే తాపత్రయంతో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వమని, గతంలో ఎన్నడూ చూడని విధంగా ప్రభుత్వ వైద్య రంగం స్వరూపాన్ని మార్చిన ఘనత సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సున్నం గంగాజలం, ఎఒ శ్రీనివాసబాబు, డాక్టర్ మురళీధర్, డాక్టర్ వాసు, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పోలవరం

మండల సమైక్య కార్యాలయంలో ఎపిఎం బెజవాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ శత్రువును కూడా ప్రేమించాలని బైబిల్ చెపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసబాబు, వెలుగు ఎసి సుబ్బారావు, డిఎంజి యోసెపు, వెలుగు సిసిలు పాల్గొన్నారు.

కిషోర్‌ను సత్కరిస్తున్న నాయకులు

కిషోర్ ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కలిదిండి ఎంసిని వైస్ చైర్మన్‌గా బత్తిని కిషోర్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొనేందుకు ముదినేపల్లి మండలం నుంచి వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో గురువారం కలిదిండికి తరలివెళ్లారు. ముదినేపల్లి మండలం నుంచి ఉదయం వైసిపి నాయకులు, కార్యకర్తలు కిషోర్ ప్రమాణస్వీకారం మహోత్సవానికి వివిధ వాహనాల్లో, బైక్లపై ర్యాలీగా ముదినేపల్లి మండలం నుంచి కలిదిండి తరలివెళ్లి ప్రమాణ స్వీకారం చేసిన కిషోర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. జెట్టి గురునాథరావు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. అలాగే మహాత్మా గాంధీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముప్పిడి శ్రీనివాసరావు, మద్దాల ప్రసాద్, బుదుసు ప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన గెలుపునకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమిష్టిగా పనిచేసి జనసేన గెలుపుకు కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బడేటి రాధాకృష్ణయ్య(చంటి) స్పష్టం చేశారు. జనసేన ఏలూరు నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జనసేన, టిడిపి ఆత్మీయ సమన్వయ సమావేశం జనసేన నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రెడ్డి అప్పలనాయుడు, బడేటి చంటి మాట్లాడుతూ టికెట్ ఎవరికి ఇచ్చినా విజయమే లక్ష్యంగా పని చేస్తామని, అదే ఏకైక లక్ష్యం అన్నారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు పాలి ప్రసాద్, ఉప్పాల జగదీష్ బాబు, పెద్దిబోయిన శివప్రసాద్, చోడే వెంకటరత్నం, మరడాని రంగారావు, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రూ.22 లక్షల విలువైన గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం అంతరాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద గూడ్స్ లారీ క్యాబిన్‌లో తరలిస్తున్న గంజాయిను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి అడిషనల్ ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారు జామున ఆంధ్ర, తెలంగాణా రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఇబి అధికారులు వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న గూడ్స్ లారీని ఆపి తనిఖీ చేయగా లారీ క్యాబిన్‌లో 11 గోని బ్యాగ్‌లలో 220 కేజీల గంజాయిను గుర్తించినట్లు తెలిపారు. గంజాయిని తూర్పుగోదావరి జిల్లా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారన్నారు. గంజాయి విలువ సుమారు రూ.22 లక్షల వరకు వుంటుందని తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, లారీని స్వాధీనం చేసుకొని జంగారెడ్డిగూడెం ఎస్ఇబి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఇబి సిఐ శ్రీనివాస్, ఎస్ఐ మస్తానయ్య, సిబ్బంది ప్రవీణ్, శ్యామ్, విజయ్, బుల్లబ్బులు, షరీఫ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈకింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

జగనన్నా.. మా గోడు వినన్నా..!

సిఎంకు పోస్టుకార్డుల ద్వారా అంగన్‌వాడీల వినతి - 17వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా 17వ రోజు గురువారం ఏలూరు కలెక్టర్ ఆఫీస్ వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తమ సమస్యలను పోస్ట్‌కార్డు ద్వారా రాసి వినూత్నంగా నిరసన తెలియజేశారు. అయ్యా జగన్మోహన్‌రెడ్డి మా సమస్యలు పరిష్కరించండి, మీరు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయండి అని పోస్ట్‌కార్డులు రాసి ముఖ్యమంత్రి గారికి పంపించారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించకుండా అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో అంగన్వాడీ మహిళ గుండెపోటుతో చనిపోవడానికి కారణం ఈ రాష్ట్ర ప్రభుత్వమే అని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడానికి డబ్బులు ఉన్నాయి కాని అంగన్వాడీలకు జీతాలు పెంచడానికి మాత్రం డబ్బులు లేవా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.రజిని, యూనియన్ కార్యదర్శి దుర్గాభవాని, పి.హైమావతి, స్వప్న, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు పాల్గొన్నారు.

చింతలపూడి : పోస్టుకార్డులతో నిరసన తెల్పుతున్న అంగన్‌వాడీలు

చింతలపూడి : అంగన్వాడీల సమ్మె 17వ రోజుకి చేరింది. ప్రభుత్వం అంగన్వాడీల యెడల నిరంకుశత్వానికి నిరసనగా గురువారం పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. అంగన్‌వాడీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజమ్మ, సరళ, కవిత, అరుణ, చెన్నకేశ్వరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కలిదిండి : చెవులు, కళ్లు, నోరు మూసుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెల్పుతున్న అంగన్‌వాడీలు

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ గురువారానికి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట పోస్ట్ కార్డులతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సమ్మెకు సిపిఎం, సిఐటియు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి కొండలరావు, అప్పారావు, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, ఎస్తేరు పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రులో అంగన్వాడీ వర్కర్స్ సమ్మె 17వ రోజు కొనసాగింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాల్ని అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలి పోస్ట్ కార్డులు రాసి పంపించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ భయపెట్టి, బెదిరించి నిర్బంధాలతో పని చేయించలేరని, అలాంటి ఆలోచన విధానం ప్రభుత్వం మానుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.రబియా, సీతమ్మ లక్ష్మి, త్రివేణి, సుభాషిని, ఎ.దుర్గా ధనలక్ష్మి, పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం పోలవరం పంచాయతీ ఎదురుగా పోస్ట్‌కార్డు ద్వారా తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి, మణి, సత్యవేణి, పద్మావతి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో 17వ రోజుకు చేరింది. అంగన్వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి కార్డులు రాసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రాజామణి, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

ఉంగుటూరు : అంగన్‌వాడీల నిరవధిక సమ్మె గురువారం 17వ రోజుకు చేరింది. ఉంగుటూరులో అంతన్నడు.. ఇంతన్నాడో జగనన్న నట్టేటా ముంచేశాడో.. జగనన్న.. అంటూ వినూ త్నంగా పేరడి పాటలు, భజనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు వై.సుజాత, మణి, శాంతకుమారి పాటలు పాడారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 17 రోజులుగా అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారు. గురువారం 17వ రోజు సమ్మెలో భాగంగా సిఎంకు పోస్ట్ కార్డులు రాసి పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ గత 17 రోజులుగా సమ్మె చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అంగన్వాడీ సమస్యలను పోస్ట్ కార్డుపై రాసి పోస్ట్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పుష్ప, నూర్జహాన్, నాగమణి, మండలంలోని అన్ని అంగన్వాడీలు, హెల్పర్స్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని యూటిఎఫ్ మండల అధ్యక్షుడు జి.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె పదిహేడవ రోజుకు చేరింది. కళ్లు, చెవులు, నోరు మూసుకొని నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగనవాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

కుక్కునూరు : అంగన్వాడీల సమ్మె గురువారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి యర్రం సాయికిరణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పోస్టుకార్డుల ద్వారా నిరసన తెలిపారు.

ముసునూరు : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే వరకు ఈ రిలే నిరాహార దీక్షల్లో ఆగేదిలేదని నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లి పాము రాజకుమారి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముసునూరు గ్రామ సచివాలయంలో రిలే నిరాహార దీక్షలో అంగన్వాడీలు పాల్గొని, ఉద్యమ బాటలో ఆటలు, పాటలు పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలపాల విద్యావతి, శిరీష, లక్ష్మి, విజయలక్ష్మి, దుర్గ, మేరీ సులోచన పాల్గొన్నారు.

చాట్రాయి : గత 17 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలను దౌర్జన్యంగా నడి రోడ్డుపై ఈడ్చుకుంటూ అరెస్టు చేయడం వైసిపి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు విమర్శించారు. చాట్రాయి తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ దీక్షా శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఆనాడు జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే అక్రమ అరెస్టులు చేయడానికి సిగ్గు ఉండాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు పుల్లారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ మరిబందం లోకల్ కమిటీ సభ్యులు హెచ్.రాజేంద్రప్రసాద్, నందిపాము ఏసు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మె 17వ రోజు కొనసాగింది. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వ అంగన్వాడీ వర్కర్ల సమస్యలపై స్పందించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు విమల, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : 17వ రోజు ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సమ్మె సందర్భంగా గురువారం ముఖ్యమంత్రికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఉత్తరాలు రాసి పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ నిన్న 16వ రోజు సమ్మె సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎంఎల్ఎలకు తమ సమస్యలు పరిష్కరించాలని వెళితే విజయవాడలో ధర్నా చౌక్ వద్ద అంగనవాడీ వర్కర్స్‌ని అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎం.శివ రత్న కుమారి, అడప నాగజ్యోతి, బొబ్బర చిట్టి, ఎం.మంగ పాల్గొన్నారు.

న్యాయ సలహాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ గురువారం స్థానిక చాటపర్రు గ్రామ సచివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వ్యక్తి పైన అయినా నేరము మోపబడినప్పుడు, ముందస్తుగా లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందన్నారు. కావున కక్షిదారులు ఈ సౌలభ్యం ఉపయోగించుకోవచ్చు అని, అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రయివేటు సంస్థలలో, కర్మాగారాలలో, విద్యా సంస్థలలో లింగ వివక్షత తగదని, అందరిని సమానంగా చూడాలని తెలియజేశారు. అలాగే బాల్య వివాహాల, ఉచిత న్యాయాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ ఎంఆర్‌ఒ పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ ప్రణతి, గ్రామ కార్యదర్శి రవీంద్రబాబు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

చంద్రన్న పాలన సర్వజనహిత పాలన అని చింతలపూడి నియోజకవర్గ యువ నాయకులు సోంగా రోషన్ కూమర్ అన్నారు. చింతలపూడి పట్టణంలో కంటి క్యాన్సర్‌తో బాధ పడుతున్న పొన్నాడ ప్రభావతికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తమ వద్దకు తీసుకు వచ్చారని, మానవత్వంతో తమ తోచిన సహాయం అందజేసినట్లు తెలిపారు. రాజకీయాలకి అతీతంగా వెంటనే ప్రభావతి స్థితిని అర్థం చేసుకొని వారికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి-జనసేన నాయకులు పక్కాల వెంకటేశ్వర్లు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోంద్రు దేవా, బోడా నాగభూషణం, తూము విజయ్ కుమార్, పొదిల రాయప్ప, వరిగంజి రజనీబాబు పాల్గొన్నారు.

మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పరిశీలన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

రూ.49.26 కోట్ల వ్యయంతో జరుగుతున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆసుపత్రి పనులు యుద్ధ ప్రాతిపదికన, సరవేగంగా జరుతున్నాయని, పూరైన వెంటనే బడుగు, బలహీన వర్గాల ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా నియోజకవర్గ ప్రజలందరికీ కేంద్ర బిందువులో అనేక వైద్య సేవలు అందటానికి అవకాశం ఉందన్నారు. అనంతరం అల్లికాలువ సమీపంలో జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వరకు రూ.370 కోట్లతో నిర్మిస్తున్న జాతీయ రహదారి, భూసేకరణ పనుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గిరిజన మెట్ట ప్రాంతంలో జాతీయ రహదారి రావడం చాలా సంతోషకరమన్నారు. ఈ రహదారి వల్ల రవాణా సౌకర్యం కూడా సులభంగా ఉంటుందని, పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి మొడియం రామతులసి, మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, వైస్ ఎంపిపి గుగ్గులోతు మోహన్ రావు, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

గాంధీ సేవాశ్రమాన్ని అభివృద్ధి చేయాలి

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు అప్పారావు

ప్రజాశక్తి - మండవల్లి

జాతిపిత మహాత్మా గాంధీ గొప్పతనాన్ని భావితరాలకు తెలియజెప్పే విధంగా గాంధీ సేవాశ్రమాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు కోరారు. నూతన ఎండోమెంట్ అధికారిగా పదవి బాధ్యతలు చేపట్టిన దివ్యశ్రీని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లిలో 5.50 సెంట్లలో గాంధీ ఆశ్రమం ఉందన్నారు. స్వాతంత్రం వచ్చిన తొలి రోజుల్లో గాంధీ సేవాశ్రమంలో రాట్నంతో నూలు ఒడుకుట, కూరగాయల, మల్బరీ తోటల పెంపకం, కుట్టు మిషన్లు, అల్లికలు వంటి కుటీర పరిశ్రమలు నిర్వహించేవారన్నారు. అయితే వాటివల్ల పేద, బడుగు, బలహీన వర్గాలు ఎంతగానో ఉపయోగపడేవని తెలిపారు. ఈనాడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారిని నిర్మించి ఆశ్రమం అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆమెను కోరారు. ఈ సందర్భంగా దివ్యశ్రీ మాట్లాడుతూ రహదారి ఏర్పాటు చేసేలా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు దృష్టికి తీసుకువెళ్లి రహదారి నిర్మించేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, బండి రంగారావు, అర్జంపుటి రవి పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభ గుర్తింపునకు ఆడుదాం ఆంధ్రా : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామీణ ప్రాంత క్రీడాకారులు గుర్తింపు పొందేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం సహకరిస్తుందని ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి తెలిపారు. మండల పరిధిలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆర్‌డిఒ గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్ణీత ఆదేశాల మేరకు భీమడోలు హైస్కూల్‌లో కొనసాగిస్తున్న ఖోఖో పోటీలను ఆయన తిలకించారు. అంతకుముందు తహశీల్దార్ ఎం.ఇందిరా గాంధీ క్రీడాకారులను ఆర్‌డిఒకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ క్రీడల వల్ల విద్యాపరంగా, ఉపాధి కల్పనాపరంగా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సర్వేయర్ ధర్మారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, వెంకట్రావు, గ్రామ రెవెన్యూ అధికారులు వినయ్, సాల్మాన్ రాజు, మార్కండేయులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : యువత చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి కలిగి వుండాలని గొల్లగూడెం సర్పంచి లింగవరపు రమేష్ అన్నారు. గొల్లగూడెం సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఆయన క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడవినెక్కలం సర్పంచి వేమురాజు, మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణరాజు, ఎంఇఒ సర్వేశ్వరరావు, ఇఒపిఆర్‌డి శేఖర్, పంచాయతీ కార్యదర్శులు సంగమయ్య, పుల్లారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ఆటల్లో కూడా ప్రావీణ్యత సంపాదిస్తారని ముసునూరు మండల ఎంపిడిఒ జి.రాణి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా ఆటల్లో కబడీ, కోకో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మెంటన్ ఆటల్లో విజయం సాధించిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ కూచిపూడి సాయిరాం, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆలీఖాన్, బి.సుకుమార్ పాల్గొన్నారు.



ఆగిరిపల్లి : పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచి రమేష్

జంగారెడ్డిగూడెం : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. గురువారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పురుషులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో 24 జట్లు కబడ్డీ పోటీలలో పాల్గొనగా, 9 జట్లు విజేతలుగా నిలిచారని తెలిపారు. అనంతరం మండల స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్లీవ జోజి, ఎంపిడిఒ ప్రసాద్, పాఠశాల, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో గురువారం టిడిపి నాయకులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గార్లపాటి నరసింహారావు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి రంగంలోకి తీసుకెళ్తాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భీమడోలులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారంతో 267వ రోజుకు చేరింది. కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయం-2 ఏరియాలో రెండవ రోజు పర్యటించారు. దీనిలో భాగంగా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులు ఎవరికైనా లబ్ధి చేకూరకుంటే వారికి లబ్ధి చేకూరే విధంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగా, ఎంపిపి కె.రామయ్య, భీమడోలు సర్పంచి సునీత మాన్సింగ్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, ఎంపిటిసిలు జాన్సన్, కృష్ణ చైతన్యతో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి ఠాగూర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సింగరాయపాలెంలో నేడు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో జరుగుతున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం జరిగే భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగుతున్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకుగాను ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టనునట్లు ఎస్ఐ డి.వెంకట్ కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే అఖండ అన్నసమారాధన సందర్భంగా సింగరాయపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కైకలూరు నుంచి గుడివాడ వెళ్తున్న వాహనాలు యధావిధిగా వెళ్లిపోవచ్చునని, కలిదిండి వైపు నుంచి గుడివాడ వచ్చు వాహనాలు కోరుకొల్లు నుంచి చిగురుకోట, ముదినేపల్లి మీదగా గుడివాడ వెళ్లవచ్చునని, లేదా కైకలూరు వైపు నుంచి వెళ్లవలెనన్నారు. అదే విధంగా గుడివాడ వైపు నుంచి కలిదిండి వెళ్తున్న వాహనాలు కైకలూరు మీదగా వెళ్లవలెనని, బంటుమిల్లి వైపు నుంచి ముదినేపల్లికు వచ్చే వాహనాలు, చేవూరు వైపు నుంచి సింగరాయపాలెంకు వచ్చే వాహనాలు సింగరాయపాలెం సెంటర్‌లోకి అనుమతించబడవన్నారు. ఆర్‌టిసి బస్సులు మాత్రం యధావిధిగా తిరుగుతాయని తెలిపారు.

మాల మహానాడులో పలువురు చేరిక

ముదినేపల్లి : మాల మహానాడు సంఘంలో నియోజవర్గంలోనే వివిధ గ్రామాలకి చెందిన 25 మంది చేరినట్లు మాల మహానాడు అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సేవ నాగ జగన్ బాబురావు తెలిపారు. ముదినేపల్లిలోని మాల మహానాడు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో నాలుగు మండలాలలో కుల, మత బేధం లేకుండా చాలామంది మాల మహానాడు సంఘంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో వైసిపిని నమ్ముకుని జగన్ మీద అభిమానంతో దూలం నాగేశ్వరరావుకు ఓట్లు వేసి ఎంఎల్‌ఎగా చేస్తే, డిఎన్ఆర్ వైసిపి అభిమానుల మీద, పార్టీ కార్యకర్తల మీద తప్పుడు కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేశారన్నారు. జగన్ మళ్లీ ఎంఎల్ఎ టికెట్ నాగేశ్వరరావుకి ఇస్తే దూలం నాగేశ్వరావుని డిపాజిట్లు లేకుండా ఓడించడానికి తాను, మాల మహానాడు సంఘం పని చేస్తామన్నారు.

స్వామివారికి లక్ష తులసి పూజ

ముదినేపల్లి : ముదినేపల్లిలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రం, పునర్వసు నక్షత్రం, ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి లక్ష తులసి పూజ, శాంతిహోమం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీమాన్ బృందావనం రామ శ్రీనివాసచార్యులు, లక్ష్మీ నరసింహ చార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

రాపాక శరమ్మ, భర్త : సురేష్‌కుమార్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పెనుగొండ నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళు తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెం. M1541170 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్ : రాపాక శరమ్మ, భర్త : సురేష్‌కుమార్ రాజుగూడెం, పెనుగొండ మండలం, ప.గో.జిల్లా పిన్ - 534320, సెల్ : 8184827381

దస్తావేజులు పోయినది

పంద్రాజు లక్ష్మీ అను నేను మాదేపల్లి గ్రామములో నివసించుచున్నాను. నా యొక్క లింకు దస్తావేజు నెం.4064/2004 & రెండవ దస్తావేజు నెం.8047/2002 ఏలూరు లోని బిర్లాభవన్ సెంటర్ సమీపంలో పోయినవి. సదరు రెండు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియపర్చగలరు.

పంద్రాజు లక్ష్మీ,
సెల్ : 8096727997